నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఘట్‌కేసర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ఘట్‌కేసర్ టౌన్‌లో, 11 కేవీ శివారెడ్డి గూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంతకుమార్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దమ్మాయిగూడలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కీసర: 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో కాలనీ ప్రజలకు తడి,పొడి చెత్తపై సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, వర్షాకాలం నేపథ్యంలో డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రభు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బద్రుకా డీన్‌గా అరుణాచలం



మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని డబీల్‌పూర్‌లోని బద్రుకా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల నూతన డీన్‌గా డాక్టర్ ఎస్. అరుణాచలంను కళాశాల పాలక మండలి నియమించింది. టెక్సాస్ టెక్ యూనివర్సిటీలో మార్కెటింగ్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఆయన విధులు నిర్వర్తించారు.

మర్యాద పూర్వక కలయిక

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ నూతన కమిషనర్ వెంకట్‌రెడ్డిని గురువారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగోజి నర్సింహచారి, పలువురు కాంట్రాక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఉపాధ్యక్షులు రమేష్, సైదులు, సెక్రటరీ శ్రీను, జనరల్ సెక్రటరీ రాజు, క్యాషియర్ కృష్ణ, కన్వీనర్ బలరాం, గౌరవ అధ్యక్షులు శ్రీను, సలహాదారులు రాంరెడ్డి, వెంకటయ్య, కొమురయ్య, షేక్‌ఆజి, శంకరయ్య, సత్తయ్య, లింగారెడ్డి, క్రాంతికుమార్, రంగారెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో సివిల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు

వానమ్మ.. రావమ్మ !

వర్షాల కోసం రైతుల ఎదురుచూపు ● ఓ వైపు పంటల సాగు ఆలస్యం ● మరో వైపు తగ్గుతున్న భూగర్భ జలాలు

మేడ్చల్ జిల్లా రియల్ మాయతో ఇప్పటికే పంటలసాగు సామర్థ్యం పూర్తిగా తగ్గిపోగా.. వ్యవసాయంపైనే ఆధారపడి ఎకరం రెండెకరాల్లో పంటలు సాగుచేసే రైతులు సైతం వర్షాలు లేకపోవడంతో వాన కోసం ఎదురుచూస్తున్నారు.
– మేడ్చల్



మూడు చింతలపల్లి మండలంలో దున్నిన దుక్కులు

25 వేల ఎకరాల్లో పంట సాగు..

మేడ్చల్ జిల్లాలో మేడ్చల్, ఘట్‌కేసర్, దుండిగల్, కీసర, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి తదితర మండలాల్లో రియల్ భూం.. బాగానే ఉన్నప్పటికీ పంటల సాగు భాగానే ఉంది. జిల్లాలో 49 వేల మంది రైతులు దాదాపు 25 వేల ఎకరాల్లో పంటలను సాగుచేస్తున్నారు. బోర్లు ఉన్నా.. రైతులు ఎక్కువగా వరి పంటలను సాగు చేస్తుండగా.. వర్షంపై ఆధారపడి మొక్కజొన్న, జొన్న, కంది వంటి ఆరుతడి పంటలను సాగు చేస్తుండగా.. ఈ సీజన్‌లో వరుణ దేవుడు ఇంత వరకు కరుణించకపోవడంతో ఉన్న కొద్ది కమతాల్లో పంటల సాగుపై రైతులు ఆశలు వదులుకోవాల్సి వస్తోంది.

మురిపించి.. ముఖం చాటేసి...

ఈ సీజనలో వర్షాలు 15 రోజుల ముందే కురిసి రైతులను మురిపించి అసలు సీజన్ ప్రారంభమయ్యేసరికి ముఖం చాటేశాయి. రోహిణి కార్తి కంటే ముందు వర్షాలు మేడ్చల్ ప్రాంతంలో జోరుగా కురిశాయి. సీజన్ ఆరంభం కాకముందే కురిసిన వర్షాలకు రైతులు ఆనందపడి దుక్కులను సిద్ధం చేసుకుని వరినాట్ల కోసం నారు పోసి అంతా సిద్ధం చేశారు. విత్తనాలు కొనుగోలు చేసి, ఇంట్లో పెడుతున్నారు. వర్షం లేకపోవడంతో పూర్తిగా డీలా పడిపోయారు.

ఎంత కావాలి.. ఎంత కురిసింది..

రైతులు పంటలను సాగు చేయడానికి జూన్ నెలలో 89.4 మిల్లీ మీటర్ల వర్షం కురియాల్సి ఉండగా.. కేవలం 24.6 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఏప్రిల్ నెలలో 18.3 మి.మీ అవసరం ఉండగా.. 43.9 కురియగా.. మే నెలలో 26.3 అవసరం కాగా.. 120.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

◆ జూన్ నెల చివరిలో ఉన్నా.. కావాల్సిన వర్షపాతం కురియకపోవడంతో రైతులు సీజన్ ఆరంభంలోనే దిగులు చెందుతున్నారు. సీజన్ ఆరంభంలోనే వర్షాలు లేకపోవడంతో ఈ సీజన్‌లో వరి వంటి పంటలు సాగు చేయాలా వద్దా.. అనే మీ మాంసలో ఉన్నారు.

ఎక్కడ ఎంత..?

మేడ్చల్ మండలంలో 5410 ఎకరాల సాగు సామర్థ్యం ఉంది. ఘట్‌కేసర్ మండలంలో 5264 ఎకరాలు, కీసరలో 3505 ఎకరాలు, మూడు చింతలపల్లిలో 5616 ఎకరాలు, శామీర్‌పేట్ మండలంలో 4009 ఎకరాలు, దుండిగల్ మండలంలో 833 ఎకరాల సాగు సామర్థ్యం గల భూములు ఉన్నాయి. మొత్తం 24,637 ఎకరాల పంటసాగు సామర్థ్యం ఉంది. పంటల సాగు కోసం రైతులు సిద్ధంగా ఉన్నా.. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో సాగు ఇంతవరకు మొదలు కాలేదు. రైతులు ఆరంభంలో కురిసిన వర్షాలకు నారుపోసి సిద్ధం చేశారు.

వర్షంపైనే ఆధారపడి...

శివారులోని చెరువులు, కుంటలలో నీరు సమృద్ధిగా ఉన్నా.. వేసవిలో భూతాపంలో భూగర్భ నీరు పూర్తిగా అడుగంటి పోయాయి. దీంతో చెరువుల కింద ఉన్న బోర్లు సైతం నీరు పోయడానికి మొండికేయడంతో అందరూ.. వర్షంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రధానంగా ఆరుతడి పంటలు సాగుచేసే రైతులు మొదట్లో కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని, సాగు సిద్ధం కాగా.. నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆలస్యమైతే ఆరుతడి పంటలే ముద్దు..

ప్రస్తుతానికి వ్యవసాయ సీజన్ దాటిపోకున్నా.. వర్షం కురియడం ఆలస్యమవుతుంది. ఇప్పటికే సాగులో మునిగిపోవాల్సిన రైతు వర్షం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. తక్కువ నీరు అవసరమయ్యే వంగడాలను ఎంపిక చేసుకుని, ఆరుతడి పంటలను సాగుచేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

◆ నగర శివార్లలో ఉన్న మేడ్చల్ జిల్లా రైతులు సాగుకు రియల్‌మాయతో దూరంగా ఉన్నా.. వ్యవసాయం పైనే ఆధారపడి ఉన్న కొంతమంది రైతులు మాత్రం వర్షం కోసం నిత్యం ప్రార్థనలు చేస్తున్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టంగా కాకుండా ఇష్టంతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని తూంకుంట, దేవరయాంజల్‌లోని మండల పరిషత్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. తరగతి గదులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, విద్యార్థులకు పంపిణీ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠాలు బోధించేటప్పుడు విద్యార్థులు శ్రద్ధతో విని వాటిని గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మరమ్మతులను చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించాలని, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డీఈఓ విజయ కుమారి, మున్సిపల్ డీఈ సునీత, మేడ్చల్ సీడీపీఓ శారద, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



రాయిలాపూర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మేడ్చల్: 9 రోజుల్లోనే రూ.9000 కోట్లను రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేయడంతో మేడ్చల్‌లో కాంగ్రెస్‌నేతలు గురువారం సంబరాలు నిర్వహించుకున్నారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు చెందిన కాంగ్రెస్ నేతలు మేడ్చల్‌లో వివేకానంద విగ్రహం వద్ద, రాయిలాపూర్‌లో రైతువేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రమణారెడ్డి, సంజీవరావు, రవిముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, రాజు, శంకర్, కొండల్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, స్వామియాదవ్, మహేష్, సత్యనారాయణ, భూషణం, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న కమిషనర్ వసంత

జవహర్‌నగర్: 100 రోజుల ప్రణాళికలో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపారాల్లో మహిళలు మరింత రాణించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

మేడ్చల్: నియోజకవర్గంలోని వివిధ మున్సిపాలిటీలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన రాజేశ్వర్‌కు రూ.60,000, కొర్రెములకు చెందిన విమలకు రూ.36,500, పోచారంకు చెందిన స్వరూపకు రూ.37,500, కొర్రెముల్‌కు చెందిన కుమార్‌కు రూ.32,500, పీర్జాదిగూడకు చెందిన సచికేత్‌కు రూ.60,000, కీసరకు చెందిన బాల్‌రెడ్డికి రూ.60,000, కీసరకు చెందిన నర్సింహ్మకు రూ.60,000, కీసర దాయరాకు చెందిన అండాలుకు రూ.33,500, కీసరకు చెందిన సత్తిరెడ్డికి రూ.39,000, రాయిలాపూర్‌కు చెందిన జయలక్ష్మికి రూ.60,000, మేడ్చల్‌కు చెందిన నాగమణికి రూ.37,500 ఆర్థికసాయం సీఎం సహాయనిధి వైద్యంకోసం మంజూరుకావడంతో ఆ చెక్కులను వజ్రేష్‌యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మల్లేష్‌గౌడ్, కొండల్‌రెడ్డి, శంకర్‌యాదవ్ బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె నోటీసు అందజేత

పోచారం: 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేసి, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. జూలై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డికి సీఐటీయూ నాయకులు నోటీసు ఇచ్చారు. 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామని నోటీసులో పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు చింతల యాదయ్య, సబిత, వర్కర్స్ యూనియన్ నాయకులు దాసు, చంద్రమౌళి, దేవేందర్, చంద్రశేఖర్, అశోక్, ప్రవీణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మేడ్చల్‌లో విద్యార్థులతో కలిసి పోలీసుల ర్యాలీ

మేడ్చల్: యువత మాదక ద్రవ్యాలకు చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే వారి భవిష్యత్తు అందంగా ఉంటుందని, లేదంటే మత్తుకు బానిసై జీవితం నాశనం అవుతుందని మేడ్చల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. మాదక ద్రవ్యాల అక్రమ సరఫరా పెరుగుతుండటంతో విద్యార్థులు మత్తుకు ఆకర్షితులు అవుతున్నారని, మత్తు కేవలం తాత్కాలిక ఉపశమనం ఇచ్చి జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండి జీవితంలో లక్ష్యాలను సాధించేలా ముందుకు నడవాలని సూచించారు. మాదకద్రవ్యాల వాడకం, సరఫరా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కళాశాల డైరెక్టర్లు సుబ్బరత్నం, వేముల రాఘవేందర్‌రెడ్డి, భరతసింహారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ మహేష్‌బాబు, కెప్టెన్ మౌనిక, పీవీవీఎస్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



డగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులతో అవగాహన ర్యాలీ..

మేడ్చల్: మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మేడ్చల్ పోలీసులు విద్యార్థులతో కలిసి మేడ్చల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులతో కలిసి ఉమానగర్‌లో ర్యాలీ నిర్వహించి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, విద్యార్థులు, టీచర్లు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు..

శామీర్‌పేట్: యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని జినోమ్‌వ్యాలీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి, లాల్‌గడి మలక్‌పేట, కొల్తూర్‌లలోని పాఠశాలల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా మాదకద్రవ్యాలను వినియోగించినట్లు గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్–1908 లేదా 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై ప్రత్యూష్‌రెడ్డి, తుర్కపల్లి, కొల్తూర్, లాల్‌గడి మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మారని రూపు రేఖలు !

గ్రామపంచాయతీ నుంచి కార్పొరేషన్‌గా మారిన జవహర్‌నగర్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లాలో అత్యధిక జనాభా కలిగినా.. అభివృద్ధిలో మాత్రం కలగానే మిగిలిపోతోంది.

హోదా పెరిగినా.. ఊసేలేని అభివృద్ధి
- ఇరుకు రోడ్లు, మురుగుతో దుర్వాసన
- బురదమయమైన రోడ్లు, ఇబ్బంది పడుతున్న ప్రజలు



జవహర్‌నగర్‌లో అస్తవ్యస్తంగా ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం రెండు లక్షలకు పైగా జనాభా ఉండగా అదనంగా మరో 50 వేలమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నారు.

◆ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసుకుంటూ.. ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఇక్కడే డంపింగ్‌యార్డు ఉండటంతో రద్దీ మరింత ఎక్కువైంది. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు, చెత్త లారీలు, టిప్పర్లతో ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది.

◆ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఇటీవల కోట్లాది రూపాయలు మంజూరు చేసి, అంబేడ్కర్‌నగర్ నుంచి బాలాజీనగర్ వరకు 100 ఫీట్ల రోడ్డు పనులను ప్రారంభించారు. బాలాజీనగర్ నుంచి యాప్రాల్ ప్రధాన రహదారి పనులు చేయాల్సి ఉంది. ఆ నిధులతోనే రోడ్డును విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డును విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.


వెలగని లైట్లు...

పట్టణంలో ప్రధాన రహదారి వెంట ఉన్న లైట్లు వెలగకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలో 8,500 విద్యుత్ స్తంభాలు ఉండగా.. వాటిలో దాదాపు 2 వేల స్తంభాలకు లైట్లు లేవు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు...


28 డివిజన్లలో చాలా కాలనీల్లో రోడ్లు ధ్వంసమై గుంతలమయంగా మారాయి. చిన్నపాటి జల్లులకే బురదమయంగా మారుతున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీటి ట్యాంకులు నిర్మించినప్పటికీ ప్రజల దప్పికమాత్రం తీరడంలేదు.

పట్టించుకునే వారే కరువు



శివాజీనగర్‌లో చాలా కాలనీలలో అసంపూర్తిగా రోడ్లు, డ్రైనేజీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వర్షం పడితే నరకం కనబడుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని అభివృద్ధిపై దృష్టి సారించాలి.
– రవీందర్, శివాజీనగర్

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం



ప్రస్తుతం 100 రోజుల యాక్షన్‌ప్లాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అన్ని కాలనీల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ఇంకా చేపట్టాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం.
– వసంత, జవహర్‌నగర్ కమిషనర్

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

శామీర్ పేట : మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కేశవరంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా మర్యాల రమేష్, ధర్మకర్తలుగా ముద్రగణం రాజుకుమార్, కొంపల్లి ప్రవీణ్‌కుమార్, కాసుల వెంకటేష్, దీరావత్ శంకర్‌లను దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్, ఈవో శ్రీనివాసులు నూతన కమిటీని ప్రమాణ స్వీకారం చేయించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, రాష్ట్ర హజ్‌యాత్ర కమిటీ సభ్యుడు ముజీబ్‌హుద్దీన్, ఏ- బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు విశ్వేశ్వరగుప్తా, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

3న రంగనాథ ఆలయంలో సామగ్రి వేలం

పోచారం: యంనంపేట్‌లోని రంగనాథస్వామి దేవస్థానంలో జూలై 3న ఉదయం 11 గంటలకు కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.భాగ్యలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు షరతులకు లోబడి వేలంలో పాల్గొనాలని కోరారు. సామాగ్రి కాలపరిమితి 2025 ఆగస్టు 1 నుంచి 2026 జూలై 31 వరకు ఉంటుందని పేర్కొన్నారు.

క్రషర్ క్వారీల పరిశీలన



గిర్మాపూర్‌లో క్రషర్‌ల వద్ద పర్యటిస్తున్న అధికారులు

మేడ్చల్: మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని క్రషర్ మిషన్లు, క్వారీల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గిర్మాపూర్, రాయిలాపూర్, బండమాదారంకు చెందిన పలువురు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం జిల్లా అధికారులు క్రషర్లు, క్వారీలను పరిశీలించారు. జిల్లా మైనింగ్ అధికారి సైదులు, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి స్వప్న తమ అధికారులు, సిబ్బందితో కలిసి 3 గ్రామాల్లోని క్రషర్‌ల వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. క్రషర్లలో పనిచేస్తున్న బ్లాస్టింగ్‌ల వల్ల వాయుకాలుష్యం, శబ్ద కాలుష్యం విపరీతంగా ఉందని, ఇళ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అక్కడ ఉన్న పరిస్థితిని అధికారులకు వివరించారు. అక్రమంగా బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, స్థానికులు అధికారులకు చెప్పారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీజేపీ నేతలు గురువారం మున్సిపల్ ప్రత్యేకాధికారి యాదగిరికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని వార్డులలో పాత విద్యుత్ స్తంభాలు, నేలకు ఒరుగుతున్న స్తంభాలు, విద్యుత్ తీగల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కిషన్‌రామారావు, నాగరాజు, నవీన్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రాంపల్లి డీఎస్ఆర్ కాలనీలో పనులను ప్రారంభిస్తున్న కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి డీఎస్ఆర్ రాజ్ ఎన్‌క్లేవ్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి గురువారం డీఎస్ఆర్ కాలనీలో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలు ప్రాధాన్యత క్రమంగా పరిష్కరిస్తామన్నారు. డీఈ సంతోష్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్, నవీన్, హైడిశ్వర్, వెంకటరామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.